క్లుప్తంగా

నేడు పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజుల చెల్లింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యాన మంగళవారం సెంట్రల్ నియోజకవర్గంలోని నగరపాలక సంస్థ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి చేతులమీదుగా పరీక్ష ఫీజు చెల్లించనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము సామాజిక బాధ్యతగా 14 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పరీక్ష ఫీజును గత 18 సంవత్సరాలుగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పరీక్ష ఫీజు అందిస్తారని తెలిపారు.

స్పందన వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం



పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం చెరువు పార్కులో సోమవారం స్పందన వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. అధ్యక్షులు ఇమ్మానేని కృష్ణప్రసాద్, కార్యదర్శి దంతన్ మురళీ, కోశాధికారి చెన్నకేశవ, 23 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ గత సంవత్సరం ఈ ప్రాంత ప్రజలకు వాకర్స్ క్లబ్ చేసిన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. పలువురికి యోగా మ్యాట్లు, టీషర్టులు, అవార్డులు బహూకరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వాకర్స్ కేబినెట్ కార్యదర్శి డాక్టర్ పి.పుష్పలత, కోశాధికారి బాలాజీ, అడిషనల్ కార్యదర్శి కొండాయిగుంట రాము, డాక్టర్ బ్రహ్మదేశం వసంత్ కుమార్, డెప్యూటీ గవర్నరు గుర్రం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. అత్తులూరి విజయలక్ష్మి పాల్గొన్నారు.

దట్టమైన పొగతో స్థానికులు ఆందోళన



పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం లోని శ్మశనవాటిక వెనుక పక్క సోమవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటం, దట్టమైన పొగ రెండు గంటల పాటు వ్యాపించడంతో స్థానికులు ఆందోళన చెందారు. ఆ ప్రాంతంలో ఫర్నిచర్ షాపులు, టింబర్‌డిపోలు, ఇతర వ్యాపార షాపులు ఉండటంతో అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని భయాందోళనలో స్థానికులు ఆటోలు, ద్విచక్రవాహనాలపై పెద్ద సంఖ్యలో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. వీఎంసీ సిబ్బంది ప్లాస్టిక్‌చెత్తకు నిప్పు పెట్టారు. పెద్ద మొత్తంలో చెత్త ఉన్నప్పుడు తరలించకుండా నిప్పు పెట్టడం వలన మంటల వలన వ్యాపించిన పొగతో ఆ ప్రాంతం వాతావరణ కాలుష్యం ఏర్పడిందన్నారు. ప్రజల నివాసిత ప్రాంతాలకు దగ్గరగా ఇలాంటి పనులు చేపట్టవద్దని స్థానికులు వీఎంసీ సిబ్బందికి సూచించారు.

పేద ముస్లింలకు చేయూతనివ్వాలి

పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీలో నూతనంగా సభ్యత్వం తీసుకుంటున్న యువత పేద ముస్లింలకు చేయూతనివ్వాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా సూచించారు. 64వ డివిజన్‌కు చెందిన షేక్ నాగూర్ ను ఆజాద్ ముస్లిం కమిటీ విజయవాడ నగర యూత్ అధ్యక్షులు, షేక్ షరీఫ్ హుద్దీన్‌ను సెంట్రల్ నియోజకవర్గం యూత్ ఉపాధ్యక్షుడి గా సోమవారం నియమించారు. వారికి నాగుల్ మీరా నియామకపత్రాలు అందచేశారు. డివిజన్ అధ్యక్షులు ఆహమ్మద్ అలీ, మాదుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ నాగూర్‌బాషా, 61వ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండీ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

భగవద్భక్తుల కథలే శ్రీమద్భాగవతం



విజయవాడ కల్చరల్: భగవద్భక్తుల కథలే భాగవతమని పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని కళాపీఠం వేదికమీద భాగవత సప్తాహం కార్యక్రమాలు భక్తిగా సాగుతున్నాయి. సోమవారం నాటి కార్యక్రమంలో ప్రవచనం చేస్తూ భాగవతమంతా భక్తుల కథలతో నిండి ఉంటుందని చెప్పారు. అవి కథలు కావని మానవాళికి ముక్తి నిచ్చే సోపానాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వామనావతారంలోని విశేషాలు, అంబరీషోపాఖ్యానంలోని సన్నివేశాలను వివరించారు. సిద్ధార్థ సంస్థలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇష్టానుసారం బుడమేరు ఆక్రమణలు!

- 57వ డివిజన్ న్యూఆర్‌ఆర్‌పేటలో పోటాపోటీగా బుడమేరు పూడ్చివేత
- గతంలో అధికారులు చర్యలు తీసుకున్న ప్రదేశాల్లోనే మళ్లీ యథేచ్ఛగా ఆక్రమిస్తున్న వైనం



బుడమేరును పూడ్చిన ప్రదేశంలో పొక్లెయిన్ సాయంతో మట్టిని తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పదుల సంఖ్యలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.. వేల సంఖ్యలో ఇల్లు పూర్తిగా నీటమునిగాయి.. లక్షల్లో బాధిత కుటుంబాలు ఆర్థికంగా నలిగిపోయి రోడ్డునపడ్డారు.. యావత్ దేశాన్ని కలవరపెట్టిన బుడమేరు వరదల బీభత్సంతో నీట మునిగిన విజయవాడ నగరంలోని కల్లోల పరిస్థితులు ఇంకా కళ్ల ముందు కదులుతూనే ఉన్నాయి.. బుడమేరు వరదల్లో బాధితులు పెట్టిన ఆర్తనాదాలు ఇంకా ఇక్కడి ప్రజల చెవుల్లో వినిపిస్తూనే ఉన్నాయి.. బుడమేరులో దశాబ్దాలుగా జరుగుతున్న ఆక్రమణల కారణంగానే ఇంత విపత్తు చోటుచేసుకుందని తెలినా ఆక్రమణదారులు మాత్రం ఇవన్నీ మాకెందుకన్నట్లుగా మళ్లీ బుడమేరును యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు.



నేడు మళ్లీ అదే ప్రాంతంలో మట్టిని పోసిన ఆక్రమణదారులు

రాత్రికే రాత్రే మట్టి తరలించి పూడ్చివేత.....

బుడమేరులో ఏ ఇల్లు మునిగిపోతే మాకేంటీ.. ఎవరు ప్రాణాలు కోల్పోతే మాకెందుకు దిగులు.. ఎంతమంది రోడ్డునపడితే మేమెందుకు జాలి పడాలి అన్నట్లుగా కొంతమంది ఆక్రమణదారులు దిగజారి ప్రవర్తిస్తున్నారు. కాసుల వర్షం కురిపించే బుడమేరును పూడ్చేస్తూ లక్షల్లో దోచేస్తున్నారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీ నుంచి న్యూరాజరాజేశ్వరీపేట, ఇందిరానాయక్‌నగర్, దేవీనగర్, మధురానగర్, గుణదల మీదుగా బుడమేరు ప్రవహిస్తుంది. అయితే ఇక్కడి 57, 58 డివిజన్‌లలో బుడమేరుకు ఇరువైపులా ఉన్న న్యూఆర్‌ఆర్‌పేట, సన్‌సిటీ కాలనీ, ఇందిరానాయక్‌నగర్ ప్రాంతాల్లో బుడమేరు తరచూ ఆక్రమణలకు గురవుతుంది. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదురు భాగంలో బుడమేరును కొంతమంది ఆక్రమణదారులు టీడీపీ నాయకులు అండతో బుడమేరును పూడ్చేస్తున్నారు.

తూతూ మంత్రంగా చర్యలు...

బుడమేరులో జరుగుతున్న ఆక్రమణను అడ్డుకోవాల్సిన కార్పొరేషన్, ఇరిగేషన్ విభాగాల అధికారులు మామూళ్ల మత్తులో వీటిని అస్సలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఆక్రమణలపై ఏవైనా ఫిర్యాదులు అందినా, మీడియాలో కథనాలు వెలువడినా ఆ వెంటనే వచ్చి తూతూమంత్రంగా చర్యలు చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప వాటి శాశ్వత పరిష్కారంపై దృష్టిపెట్టడం లేదు. మీ పని మీదే.. మా పని మాదే అన్నట్లుగా.. అధికారులు వచ్చి బుడమేరులో వేసిన మట్టిని తొలగించి వెళ్లినప్పటికీ వారు మళ్లీ వచ్చి అవే ప్రాంతాల్లో మట్టిని పోసి మళ్లీ నింపి వ్యాపారాలు చేసుకుంటున్నారు. గత నెల 19వ తేదీన ఇరిగేషన్ విభాగం అధికారులు సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట బుడమేరులో జరుగుతున్న ఆక్రమణలపై చర్యలు తీసుకొని వెళ్లగా ఇప్పుడు ఆక్రమణదారులు మళ్లీ అదే ప్రదేశంలో మట్టితో బుడమేరును పూడ్చి రోడ్లు, ప్లాట్లు వేస్తున్నారు. ఇలా ఉన్న కొద్దిపాటి బుడమేరును కూడా మింగేస్తుంటే ఈ సారి మళ్లీ ఏవైనా వరదలు సంభవిస్తే ఈ సారి బుడమేరు ఉగ్రరూపాన్నే చవిచూడాల్సి వస్తుంది. ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడం కానీ, బుడమేరు చుట్టూ కంచెను ఏర్పాటుచేయడం కానీ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు బుడమేరులో జరుగుతున్న ఆక్రమణలపై శాశ్వత పరిష్కార చర్యలు తీసుకొని బుడమేరును పరిరక్షించి... ముంపు సమస్యల నుంచి తమ ప్రాంతాలను కాపాడాలని విన్నవిస్తున్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదురు రోడ్డులో బుడమేరులో మట్టిని పోసేసి రోడ్లు వేస్తున్న దృశ్యం

ఆక్రమణలను కూడా అడ్డుకోవడం లేదు...

బుడమేరు వరదల సమయంలో బుడమేరును ప్రక్షాళన చేయాలని కూటమి నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు బుడమేరు ప్రక్షాళనపై సంబంధిత మంత్రులు, కలెక్టర్‌లు, అధికారులను ఆదేశించినప్పటికీ అవి ఆచరణకు నోచుకోలేదు. బుడమేరును సంరక్షించడం పక్కన పెడితే ఉన్న బుడమేరును ఇటు న్యూఆర్‌ఆర్‌పేట అటు రాఘవేంద్ర థియేటర్ వెంబడి రోడ్డు, రామకృష్ణాపురం, బుడమేరు వంతెన సమీపంలో కూడా బుడమేరులో ఆక్రమణలు అధికంగా జరుగుతున్నాయి.

ప్లాట్లుగా మార్చి.. దొంగ డాక్యుమెంట్లతో విక్రయాలు...

ఇక్కడి ఆక్రమణదారులు కొంతమంది సిండికేట్‌గా ఏర్పడి బుడమేరులో మట్టిని పోసేసి ప్లాట్లుగా మారుస్తున్నారు. దశాబ్దాలుగా స్థానికంగా తిష్టవేసిన వీరు గాంధీనగర్‌లోని ఓ డాక్యుమెంట్ రైటర్ కార్యాలయాన్ని కేంద్రంగా చేసుకొని వీటికి దొంగ డాక్యుమెంట్లను సృష్టించి అమాయక ప్రజలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో కూడా ఇదే విధంగా కొంతమంది అమాయక ప్రజలు బుడమేరులో ప్లాట్లు కొని మోసపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. తక్కువ రేట్లలో వచ్చే సరికి అమాయక ప్రజలు వీటిని కొనడం ఆ తరువాత బుడమేరులో ఉండడంతో వాటికి ప్లాన్‌లు రాకపోవడంతో తాము మోసపోయామని బాధపడుతున్నారు. తమ డబ్బులు తమకు తిరిగి ఇప్పించేయాలంటూ గతంలో పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీలు కూడా నడిచాయి.

ధర్మాచార్య దర్శన యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. సత్యనారాయణపురంలోని గాయత్రీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ధర్మాచార్య దర్శన యాత్ర పోస్టర్ ఆవిష్కరణ సోమవారం మల్లాది విష్ణు చేతుల మీదుగా జరిగింది. ఫిబ్రవరి 3న బాసర నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి, యజ్ఞం పవన్ కుమార్ శర్మ, ఎస్. సీతారామ్, వై. శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

బాగుపడిన రాఘవాచార్య పార్కు



సాక్షి ఎఫెక్ట్

పూర్ణానందంపేట (విజయవాడపశ్చిమ): 'ఆహ్లాదం .. అమడ దూరం' శీర్షికతో ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి వీఎంసీ అధికారులు స్పందించారు. పార్కులో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రపరిచారు. దీంతో చుట్టు పక్కల ఉన్న పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ పార్కులోని ఆట పరికరాలపై ఆడుకున్నారు. పార్కు శుభ్రపడటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

వలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వలంటీర్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల హామీ రూ. 10 వేల జీతంను అమలు చేయాలని ఏపీ వలంటీర్స్ అసోసియేషన్ చేస్తున్న న్యాయపరమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని తెలిపారు. కోవిడ్ మహమ్మారి విరుచుకుపడ్డ వేళ బాధితుల వద్దకు వెళ్లేందుకు కుటుంబసభ్యులే వెనుకాడిన సమయంలో వలంటీర్లు మానవత్వంతో సేవలను అందించారన్నారు. ఆంధ్రప్రదేశ్ గురించి ప్రధానమంత్రి, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చించుకుంటున్నారంటే అది కేవలం వలంటీర్ల వ్యవస్థ వల్లనే అన్న విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గ్రహించాలన్నారు. అటువంటి వలంటీర్ వ్యవస్థపై మొదటి నుంచి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అక్కసు వెళ్లగక్కుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం 7 నెలల పాలనా వైఫల్యం.. వలంటీర్ల వ్యవస్థను నిండా ముంచిందని నిప్పులు చెరిగారు. ఎలాంటి వివక్ష, అవినీతికి తావులేకుండా సేవా దృక్పథంతో పనిచేసే వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గుర్తించాలని.. ఎన్నికల హామీని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ.. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. అలాగే గత 7 నెలలుగా ఇవ్వాల్సిన పెండింగ్ వేతన బకాయిలను సైతం వెంటనే చెల్లించాలని కోరారు.

కళ్యాణ్‌రెడ్డి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంజినీరింగ్ విద్యార్థి బోయి కళ్యాణ్ రెడ్డి మృతికి కారణమైన పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం , అధ్యాపకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ వాయిస్ ఆఫ్ మాల మహానాడు, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. కళ్యాణ్ రెడ్డికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వాయిస్ ఆఫ్ మాల మహానాడు అధ్యక్షుడు శ్యామ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రసన్న కుమార్ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు కళ్యాణ్‌బాబును తీవ్రంగా అవమానించి మనో వేదనకు గురి చేశారన్నారు. చివరికి ఆయన ఆత్మహత్యకు కారణమయ్యారన్నారు. కళ్యాణ్ రెడ్డి మృతిపై లోతైన దర్యాప్తు చేసి ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దోషులను శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని న్యాయవాది మొలకల హనుమాన్ డిమాండ్ చేశారు. కళ్యాణ్ రెడ్డి కుటుంబానికి అండగా నిలవడంతో పాటు రూ. 25 లక్షల ఆర్థిక సాయం ప్రకటించాలని కోరారు. అనంతరం కళ్యాణబాబు తల్లిదండ్రులు రామచంద్రారెడ్డి భారతి రెడ్డి సోదరులు దిలీప్ రెడ్డి , శివారెడ్డి తో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఘటన జరిగిన తీరును కలెక్టర్‌కు వివరించారు. ధర్నాలో సిగినంశెట్టి రాము గుప్తా, షేక్ షాహీనా విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన వనరులు సమకూర్చడం శాప్ బాధ్యత

శాప్ చైర్మన్ రవినాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్

విజయవాడస్పోర్ట్స్: క్రీడాకారులకు మెరుగైన వనరులు సమకూర్చడంతో పాటు సరైన వసతులు కల్పించడం ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) బాధ్యత అని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు స్పష్టం చేశారు. శాప్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో అధికారులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికలపై సత్తా చాటేలా మన రాష్ట్ర క్రీడాకారులను తయారు చేయాల్సిన బాధ్యత మనపై ఉందని గుర్తు చేశారు. క్రీడాకారులు భవిష్యత్తే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. సమన్వయం చేసుకుని సమిష్టి కృషితో క్రీడాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా శాప్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడాభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, శాప్, ఖేలో ఇండియా, కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాలు, క్రీడావికాస కేంద్రాలు, స్పోర్ట్స్ ఎరీనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండాలని సూచించారు.

నిరుపేద క్రీడాకారులకు ఎన్‌ఆర్‌ఐ అండగా నిలవాలి

శాప్ చైర్మన్ రవినాయుడు పిలుపు

విజయవాడస్పోర్ట్స్: నిరుపేద క్రీడాకారులకు ఎన్‌ఆర్‌ఐ సెల్ అండగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లాకు చెందిన పారా అథ్లెట్ భవానికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. ఎన్‌ఆర్‌ఐ లగడపాటి సుబ్బారావు సమకూర్చిన ఈ నగదును ఎన్‌ఆర్‌ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి రవినాయుడు సోమవారం అందజేశారు. అంతర్జాతీయ పారా అథ్లెట్ భవాని పడుతున్న ఆర్థిక ఇబ్బందులు తన దృష్టికి వచ్చిందని, వెంటనే ఎన్‌ఆర్‌ఐ సెల్‌ను సంప్రదించానని రవినాయుడు తెలిపారు.



పారా అథ్లెట్ భవానికి నగదు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్, చిత్రంలో శాప్ చైర్మన్ రవినాయుడు





ఆలోచనల్లో వైవిధ్యం.. ఆవిష్కరణలు అద్భుతం





విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టుకు మార్కులు వేస్తున్న జడ్జిలు

కొత్త ఆలోచనలు.. కొంగొత్త ఆవిష్కరణలతో విద్యార్థులు సత్తా చాటారు. తమ నైపుణ్యానికి సృజనాత్మకతను జోడించి వైవిధ్యమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. విజయవాడలోని ఎస్‌ఎస్ కన్వెన్షన్ వేదికగా నిర్వహించిన పాలిటెక్ ఫెస్ట్‌లో వీటిని ప్రదర్శించారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గణేష్‌కుమార్ సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఈ ఫెస్ట్‌లో.. రాష్ట్రంలోని 107 పాలిటెక్నిక్‌ల నుంచి 249 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన విద్యార్థులు తిలకిస్తున్నారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

● నూతన సంవత్సర శుభాకాంక్షలు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లాకు చెందిన నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు. – వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)

నిర్ణీత గడువు లోగా సమస్యలను పరిష్కరించాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఉదయం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రతి ఫిర్యాదును అధికారులందరూ నిర్ధారించిన గడువులోపు సంపూర్ణ పరిష్కారం చూపాలన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం-5, రెవెన్యూ-3 , ఎస్టేట్-1, అడ్మినిస్ట్రేషన్-1 ఫిర్యాదులు ఆయన స్వీకరించారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్, సూపరింటెండింగ్ ఇంజినీర్స్ పి. సత్యకుమారి, స్పీచ్ సత్యనారాయణ, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, జాయింట్ డైరెక్టర్ అమృత్, ఎస్టేట్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ లత, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, ఆర్‌ఎఫ్‌ఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది జూన్ నుంచి డిసెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలు చెల్లించాలని వలంటీర్లు కమిషనర్‌ను కోరారు.

ఫిర్యాదులపై వెంటనే విచారణ చేయండి

డీసీపీ ఉదయరాణి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీసీపీ

విజయవాడస్పోర్ట్స్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనరేట్‌కు వచ్చే ఫిర్యాదులపై సత్వరమే విచారణ చేపట్టాలని జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల అధికారులను డెప్యూటీ పోలీస్ కమిషనర్ ఎ.బి.టి.ఎస్.ఉదయరాణి ఆదేశించారు. కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో 92 మంది నుంచి డీసీపీ ఫిర్యాదులను స్వీకరించారు. నగదు లావాదేవీలపై 21, కుటుంబ కలహాలపై ఎనిమిది, మహిళా సంబంధిత నేరాలపై ఎనిమిది, ఆస్తి వివాదాలపై 18, మోసాలపై ఏడు, దొంగతనాలపై 11, వివాదాలపై 19 మంది ఫిర్యాదులిచ్చినట్లు ఆమె తెలిపారు. ఫిర్యాదుదారులతో మాట్లాడిన అనంతరం ఫిర్యాదులపై విచారణ జరిపి పరిష్కరించాలని ఆయా స్టేషన్‌ల అధికారులను ఆదేశించారు.

నగరానికి క్రీడా పండుగ



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) జాతీయ వాలీబాల్ బాలికల పోటీల నిర్వహణతో విజయవాడకు క్రీడా పండుగ వాతావరణం వచ్చిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నగరంలోని పీబీ సిద్ధార్థ కాలేజీ మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 వాలీబాల్ జాతీయ పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి మంత్రి దుర్గేష్ ఈ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో దాదాపు 25 రాష్ట్ర జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కోర్టుల్లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. 26 రాష్ట్రాల నుంచి వచ్చిన 400 మంది క్రీడాకారులకు, 70 మంది కోచ్, మేనేజర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.వి.రాధాకృష్ణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ అబ్జర్వర్ ప్రదీప్ యాదవ్, స్కూల్ గేమ్స్ కృష్ణా జిల్లా అండర్ -19 కార్యదర్శి, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకటేశ్వర్లు, వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి దయాకర్, ఏపీ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పి.అంకమ్మచౌదరి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.